క్లుప్తంగా

లిటిల్‌సోల్జర్‌కు ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్ : పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్‌కు ఉత్తమ సేవా పురస్కారం అవార్డు లభించింది. గురువారం నల్లగొండలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం, రూ.25వేల చెక్కు, ఆ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్ అందుకున్నారు. వారు కరోనా సమయంలో సేవలు అందించడంతో పాటు చిన్నపిల్లల వైద్యానికి సహాయ సహకారాలు అందించారు. వారి వెంట ప్రతినిధులు సింగారపు మారుతి, బట్టిపల్లి వెంకన్న, గుండ్ల సైదులు, మంటిపల్లి కృష్ణప్రసాద్, పోతుల నవత, సారంగి మానస తదితరులు ఉన్నారు.

పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు

నల్లగొండ టౌన్ : పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలని నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గడియారంసెంటర్‌లో నవచేతన బుక్‌హౌజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ట్రాఫిక్ సీఐ శ్రీనుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రవన్‌కుమార్, కవి మునాస వెంకన్న, వి.శ్రీనివాస్, జిల్లా యాదయ్య, కృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు అందజేత



విద్యార్థులకు పలకలు అందజేస్తున్న కౌన్సిలర్ మౌనిక

చిట్యాల : పట్టణంలోని ముత్యాలమ్మగూడెం ప్రభుత్వం పాఠశాలలోని విద్యార్థులకు 10వ వార్డు కౌన్సిలర్ సిలివేరు మౌనికశేఖర్ తన కుమారుడు శివేంద్ర పుట్టినరోజు సందర్భంగా గురువారం పలకలు, బలపాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 2వవార్డు కౌన్సిలర్ కోనేటి కృష్ణ, హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

నకిరేకల్ : మున్సిపాలిటీలో అక్రమ పద్ధతిలో చేపట్టిన సిబ్బంది నియామకాలను రద్దు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త వంటిపాక అంబేద్కర్ గురువారం కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 102మంది సిబ్బంది పనిచేస్తున్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైందని తెలిపారు. మున్సిపాలిటీ ఏర్పాటైన తరువాత అదనంగా అక్రమ పద్ధతిలో 22మందిని నియమించారని పేర్కొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా పొందాలి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో వివిధ రకాల వ్యాపారం చేసే వారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కిరాణం, మెడికల్, మెడికల్‌ఏజెన్సీలు, హోటల్స్, బార్‌అండ్ రెస్టారెంట్స్, మాంసం దుకాణాదారులు, బట్టల షాపులు, స్వీట్, బేకరీ, క్యాటరింగ్, ప్రైవేట్ విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్, నో అబ్జక్షన్ సర్టిఫికెట్‌లు, సానిటరీ సర్టిఫికెట్‌లు కలిగి ఉండాలని కోరారు. లైసెన్స్‌లు తీసుకోకపోతే మున్సిపల్ చట్టం-2019 ప్రకారం జరిమానాతో పాటు జప్తు చేయనున్నట్లు తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగును ప్రారంభిస్తున్న అలివేలు

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 9వ వార్డు కౌన్సిలర్ చిన్నాల అలివేలుజానయ్య కోరారు. గురువారం పట్టణంలోని 9వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ అమర్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కంటిపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, రాజు, వంశీ, డాక్టర్ సత్యనరేష్, పద్మ, సాయికుమార్, సరిత, జ్యోతి, ప్రవీణ్‌కుమార్, సైదులు, వసంత, సరళ, యాదమ్మ, జానకమ్మ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చెరువులు, కుంటలు

- అభివృద్ధి పనుల పేరుతో మట్టి తరలింపు
- గుంతలుగా మారుతున్న చెరువులు
- కనిపించని హెచ్చరికబోర్డులు, ప్రమాద సూచికలు
- తాజాగా కుంటలో పడి బాలుడి మృత్యువాత



ప్రమాదకరంగా ఎర్రకుంటలోని నీటిగుంతలు



కాలంవారి కుంటలోని నీటికోపులు

నకిరేకల్ : పట్టణాల పరిధిలోని పలు చెరువులు, కుంటల నుంచి అభివృద్ధి పనుల పేరుతో మట్టి తరలిస్తుండడంతో అవి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. కుంటల నుంచి మట్టి తీసుకుపోవడంతో అవి భారీ గుంతలుగా మారి వర్షాకాలంలో నీటితో నిండినప్పుడు వాటి లోతు తెలియక చాలా మంది అందులో పడి మృత్యువాత పడుతున్నారు. కొంత కాలం నీటితో నిండుగా ఉన్న కుంటలు నేడు నీరు తగ్గి పెద్దపెద్ద గుంతలుగా దర్శనమిస్తున్నాయి. ఈ కుంటల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు, రక్షణ చర్యలు లేకపోవడంతో చిన్నారులు తెలియక అటుగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. పైకి మామూలుగా కనిపించే లోతైన గుంతలు లోపలకు అడుగు పెడితే చాలు ప్రాణాలను మింగేస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో 12చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా సంతోష్‌నగర్ ఎగువ ఉన్న ఎర్రకుంట, మూసీరోడ్డులోని కాలంవారి కుంట, మినీ స్టేడియం దిగువన ఉన్న ఇసాయికుంట, బాబాసాహెబ్‌గూడెంలోని కుంటలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిలో భారీగా మట్టి తరలించడంతో గోతులు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటు కాకముందు గ్రామపంచాయతీ హయాంలో ఈకుంటల్లో కొంత మంది భారీగా మట్టి తవ్వకాలు జరిపారు. దీంతో పెద్దపెద్ద లోయల మాదిరిగా గంతలు ఏర్పాడ్డాయి. సమాంతరంగా మట్టి తవ్వకాలు చేయకపోవడంతో ఎక్కడ ఎంత లోతు గుంత ఉందో అర్థం కాని పరిస్థితి. గతంలో కాలంవారి కుంట, ఎర్రకంటల్లోకి ఇద్దరు చిన్నారులు ఈత కోసం వెళ్లి నీటిగుంతల్లో పడి మృత్యువాత పడ్డారు.

గురువారం ఎర్రకుంటలో పడి బాలుడి మృతి..

తాజాగా ఎర్రకుంట బాలుడిని బలితీసుకుంది. పాఠశాలలకు ఒంటి పూట బడులు నిర్వహిస్తుడడంతో గురువారం పట్టణానికి చెందిన నాల్గవ తరగతి విద్యార్థి సాత్విక్(9) మధ్యాహ్నం పాఠశాల ముగిసిన తరువాత తన స్నేహితులతో కలిసి సమీపంలోని ఎర్రకుంటలోకి వెళ్లి నీటికోపులో పడి మృతి చెందాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తక్షణమే ప్రమాదకరంగా ఉన్న కుంట వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని, అటుగా వెళ్లకుండా హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



మున్సిపాలిటీ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న నీటి కుంటలను అధికారులు గుర్తించాలి. కుంటలు, చెరువుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి అందులోకి ఎవరూ దిగకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. లేకుంటే వేసవిలో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

– గాజుల సుకన్య, 4వ వార్డు కౌన్సిలర్, నకిరేకల్

ప్రతి గల్లీలో సీసీరోడ్ల నిర్మాణం చేపడతాం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు : నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోని ప్రతి గల్లీలో సీసీరోడ్ల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించి మాట్లాడారు.. ఉపఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. త్వరలో మండలానికి రూ.50లక్షల చొప్పున మంజూరు చేయించి మిగిలిన వీధుల్లో సీసీరోడ్లు వేయిస్తామన్నారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సాధ్యమైనంత త్వరలో నేరవేరుస్తామన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, నాయకులు రావిరాల కుమారస్వామి, యడవల్లి సురేష్, విజయ్‌గౌడ్, శరత్‌బాబు, వాజీద్, నర్సింహ, వెంకన్న ఉన్నారు.

నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి

చండూరు : మునుగోడు ఉపఎన్నికలో ప్రజలు సరియైన నిర్ణయం తీసుకోవడంతోనే నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధిలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని 34మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 58, 59జీఓ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ఉపఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గం పరిధిలో రూ.40 కోట్లతో 100పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పేదలకు 58,59జీఓల మేరకు పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పల్లె కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, గట్టుప్పల తహసీల్దార్ శ్రీనివాస్, చండూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్, బొమ్మరబోయిన వెంకన్న, దశరథ, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.



చండూరులో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

కరపత్రాలు విడుదల

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2023–2024 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గురువారం మండల కేంద్రంలో విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నర్సింహ, అధ్యాపకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, పద్మజ, బాలసైదులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి గొప్పవరం

మర్రిగూడ : నిరుపేదలకు సీఎం సహాయ నిధి గొప్పవరం లాంటిదని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఊరే భూపతయ్యకు మంజూరైన రూ.2లక్షల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే చండూరులో అందజేశారు. కార్యక్రమంలో దళిత బంధు జిల్లా కమిటీ సభ్యుడు లపంగి నరసింహ, మాజీ సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మునుగోడులోని వీధుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు నేటికి అణచివేతకు, వివక్షకు గురవుతున్నారని, మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ×మహిళలపై ఇంకా ఎన్నాళ్లు ఈ అవమానాలు×అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగంలో మహిళలకు అన్ని హక్కులు కల్పించినా మనం వినియోగించుకోలేక పోతున్నామని అన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగిన వెంటనే ప్రభుత్వం సకాలంలో స్పందించడం లేదని, దీంతో వారికి సరైన న్యాయం జరుగడంలేదన్నారు. మహిళలు నేటికి మన శాసనసభలో 8మంది మాత్రమే ఉన్నారన్నారు. నేడు విద్యలో అమ్మాయిలదే పైచేయి ఉందని, రాజకీయ, వ్యాపార రంగాల్లో కూడా మహిళలు పైచేయి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ కౌన్సిలర్లు కూతూరు సత్యవతి, దాసోజు అరుణ, న్యాయవాది సుమశ్రీ,, పోకల ఎలిజబెత్, బీఎస్పీ కన్వీనర్ కవిత, సుజాతరెడ్డి, నీరజ, సుధారాణి, కాశమ్మ, భవానీ, తార, హైమావతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన అబ్బగోని పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గురువారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పోగుల నర్సింహ, వైస్‌ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గుర్రం సైదులు, నకిరేకంటి నర్సింహ, ఊట్కూరి శంకర్, ఎర్ర ఉపేందర్, నాతి ప్రవీణ్, గాదగోని శ్రీనివాస్, పున్న సత్తయ్య, కల్మెర రాజు, లింగయ్య, సత్తయ్య తదితరులు ఉన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

నల్లగొండ టౌన్ : టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజ్ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల దీపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీకేజీతో కష్టపడి చదువుకున్న అభ్యర్థులకు తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎలిజాల వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, మారోజు రాజ్‌కుమార్, రమేష్, సాయి, నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టూటౌన్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు గురువారం పట్టణంలోని రామగిరి సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఛత్రపతి మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో చైర్మన్, కార్యదర్శులతో పాటు స్కాం వెనుక ఉన్న బడాబాబులు ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సీఎం వెంటనే స్పందించాలని, నిరుద్యోగ యువతతో ప్రభుత్వం చెలగాటంఆడుకుంటుందని ఆరోపించారు. లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సంపత్, అభినవ్, జయందర్, ప్రశాంత్, హరిత పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు చేస్తున్న బీజేపీ నాయకులు

నార్కట్‌పల్లి : ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపన చెప్పాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేస్తే దానిని కప్పి పుచ్చుకునేందుకు ఎమ్మెల్యే ఇళ్ల ముట్టడితో పాటు ధర్నాలు, దాడులు చేస్తూ బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్న లింగయ్యకు నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక, రాజకీయంగా ఎదుర్కోలేక నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోకుంటే సరైన గుణపాఠం చెప్పాల్సి వస్తుందన్నారు. సమావేశంలో చెరువుగట్టు ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, నార్కట్‌పల్లి ఎంపీటీసీ పుల్లంల ముత్తయ్య, పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణుమూర్తి తదితరులున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి



నోములలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు సూచించారు. గురువారం మండలంలోని నోముల గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా వీధుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీటీసీ సామ మల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి రమేష్, సామ రవీందర్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, రఘు, నాగరాజు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మాదిగలపై వివక్ష చూపుతున్న ప్రభుత్వం



కలెక్టర్ కార్యాలయంలోని ఇన్‌వార్డులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మర్రిగూడ : మాదిగలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గ్యార శ్రీనివాస్‌మాదిగ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో మాదిగల కమ్యూనిటీ హాల్ మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. 2019 నుంచి కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఇదే విషయాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డికి కూడా గతంలో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వైద్యఆరోగ్య, ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావు మండల కేంద్రంలో 30పడకల ప్రభుత్వాసుపత్రి ప్రారంభంలో మాదిగల కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు నిర్మించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ మండల కోఆర్డినేటర్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : మంచిర్యాల పట్టణంలో ఈనెల 25నుంచి 27వరకు నిర్వహించనున్న ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి గణేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బొంగరాల నర్సింహులు, కత్తుల చంద్రశేఖర్, జానపాటి శంకర్, రావుల వీరేష్, దాసరి నర్సింహ, వెంకన్న, మహేష్, ప్రవీణ్, అశోక్, చారి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షం



మర్రిగూడలో కురుస్తున్న వడగండ్ల వర్షం

మర్రిగూడ : మండల వ్యాప్తంగా గురువారం ఈదురుగాలులు, వడగళ్లు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని వరి, మామిడి, పత్తి నిమ్మ తోటలు దెబ్బతిన్నాయి. ఏడాదిలో పత్తికి ధర లేకపోవడం, అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మునుగోడు : మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన మాలిగ మహేష్ ఏడాది క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందడంతో అతడికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం బీజేపీ నాయకులు అందజేశారు. అందజేసిన వారిలో మందుల బీరప్ప, మురారిశెట్టి యాదయ్య, మందుల స్వామి, నర్సింహ, పండు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

అందని వేతనాలు

మునుగోడు : హరితహారంలో నాటిన మొక్కలు సంరక్షిస్తున్న వాచ్ అండ్ వార్డు కూలీలకు గత మూడు నెలలగా వేతనాలు అందడం లేదు. ఉపాధిహామీ పథకం ద్వారా రోజుకు రూ.257కూలీ డబ్బులు చెల్లిస్తూ ప్రతి గ్రామానికి ఇద్దరు నుంచి ఐదుగురు చొప్పున మొత్తం మండలంలో 80మంది సిబ్బందితో అధికారులు పనులు చేయిస్తున్నారు. అయితే వారి కూలీ డబ్బులు ప్రతి నెలా పోస్టు ఆఫీస్ ద్వారా అందజేసేవారు. కాని జనవరి నుంచి వారికి డబ్బులు అందడంలేదు. పెండింగ్ వేతనాలని వెంటనే అందించాలని కోరుతున్నారు.


జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నకిరేకల్ : దేశంలో బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు నేటి(శుక్రవారం) నుంచి 28వరకు కొనసాగనున్న జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శుక్రవారం వరంగల్‌లో యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు లౌకికవాదులు, మేధావులు యాత్రలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు కందాల ప్రమీల, బొజ్జ చిన్నవెంకులు, రాచకొండ వెంకన్న గౌడ్, లూర్దు మారయ్య, మర్రి వెంకటయ్య, సుధీర్, నాగయ్య, లింగయ్య, సత్తయ్య, నాగమణి, శశికళ, లక్ష్మి, ఇందిరా, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

నల్లగొండ టౌన్ : చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లను కల్పించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి భూతం అరుణకుమారి, జిల్లా సరోజ, మేకల వర్ణ, సంహితారాణి, ఎండీ సుల్తాన, బొల్లోజు భారతమ్మ, గోలి వెంకటమ్మ, మంజుల, కృష్ణవేణి, సైదమ్మ, సరస్వతి, ఉమ, సాలమ్మ, దేవకమ్మ, సుమిత్ర, రమాదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



కనగల్ : మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ కరీంపాష



మల్లమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న పిల్లి రామరాజు

కనగల్ : మండల పరిధిలోని లచ్చుగూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మృతురాలి కుటుంబానికి ఎంపీపీ కరీంపాష ద్వారా గురువారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఎంపీపీ వెంట జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం గౌడ్, వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, కనగల్ పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, సర్పంచ్ కళావతిభాస్కర్‌రెడ్డి, జానయ్య, శేఖర్, సైదులు, నాగరాజు, లింగయ్య, బుచ్చయ్య ఉన్నారు.

పిల్లి రామరాజు ఆర్థికసాయం అందజేత..

మల్లమ్మ కుటుంబానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు ఆమె అంత్యక్రియల్లో పాల్గొని రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా బాలసాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చిర్రవారిగూడెం గ్రామానికి చెందిన చిర్ర వీరమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట ఎంపీటీసీ యేరేడ్ల సరస్వతీసుధాకర్‌రెడ్డి, గోగు అజయ్‌రెడ్డి, చిర్ర వెంకట్‌రెడ్డి, బొబ్బల రామకృష్ణ, శంకర్, సంపత్, నర్సింహ, శివ, కోటేశ్, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, రాజయ్య తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లపంగి రత్నం కుమారుడు కిడ్నీలు, లివర్, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో వైద్యం అందించేందుకు తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్ ద్వారా గురువారం వైద్యానికి అయ్యే ఖర్చును మొత్తం చెల్లించడంతో పాటు వారికి రూ.25వేల ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట లపంగి కృష్ణ, అనంతం మురళి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకారం

మాడుగులపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కస్తూరి ఫౌండేషన్ అన్నివిధాలా సహకరిస్తుందని ఆ ఫౌండేషన్ సభ్యుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తోపుచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ తరపున గురువారం ఆయన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చాపల శ్రీనివాస్, సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు జాఫర్, రాంబాబు, రామకృష్ణ, రాము, గౌస్‌బేగ్, వెంకన్న పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మాడుగులపల్లి : మండలంలోని ఇసుకబావిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, మాతృకాపూజనం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపన, మంగళ నీరాజనం తదితర పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 18 వరకు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కొనసాగనున్నాయి. చివరిరోజు భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.